సాక్షి
నంద్యాల
బుధవారం ; 19 ; జూన్ ; 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నకు, శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



అవినీతికి పాల్పడితే చర్యలు

చెక్‌పోస్టు విధులు నిర్వర్తించే సిబ్బంది మద్యం అక్రమ రవాణాకు సహకరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ నాగరాజు హెచ్చరించారు. – 8లో..



శిలాఫలకాలు ధ్వంసం

కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. – 8లో..

న్యూస్‌రీల్

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

కోవెలకుంట్ల: 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి, అలెస్కో కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల ఎంఈఓ కార్యాలయాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు యుడెస్‌ప్లస్ ప్రోగ్రెస్, పాఠ్యపుస్తకాల సరఫరా, పంపిణీ, తదితర రికార్డులు పరిశీలించారు. పాఠశాల విద్యకు సంబంధించి పలు వివరాలను ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ 14 సంవత్సరాల్లోపు పిల్లలందరూ బడులలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో బడిబయటి పిల్లలను గుర్తించి చదువుపట్ల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఐ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ వేగవంతం చేసినట్లు జిల్లా సహకార శాఖాధికారి వెంకటసుబ్బయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సొసైటీలలో ఓటు హక్కు కలిగిన ప్రతి రైతు వారి ఆధార్, పాన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మూడు ఫొటోలు, నామిని ఆధార్ కార్డు నకలు పత్రాలను సంబంధిత సహకార సంఘాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోగా ప్రతి ఒక్కరూ విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియతో రైతులకు పలు సేవలను వేగంగా అందించేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 55 శాతం ఉత్తీర్ణత

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాలో 55 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత నెల 24 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన సప్లమెంటరీ పరీక్షల మూల్యాంకనం గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు మంగళవారం సెకండియర్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఏడు ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రైవేటు కళాశాలలకు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలో 4,187 మందికి గాను 2,313 మంది (55 శాతం) ఉత్తీర్ణ త సాధించినట్లు జిల్లా డీవీఈఓ సునీత తెలిపారు.

గోరుకల్లు మరమ్మతులు పకడ్బందీగా చేపట్టండి



డ్యామ్‌ను పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం:ఈ ఏడాది గోరుకల్లు జలాశయంలో నీటి నిల్వకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మరమ్మతు పనులు పకడ్బందీగా చేపట్టాలని సీఈ కబీర్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గోరుకల్లు డ్యామ్ కట్ట కుంగిన ప్రదేశంలో చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే డ్యామ్‌కు నీరు వచ్చే అవకాశముందని, నీటి నిల్వకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఏటా నిలిపే నీటి నిల్వకు ఏమైనా ఇబ్బందులు వస్తాయా, అందుకు తగ్గట్టు పనులు ఎలా చేయాలనే విషయంపై ఆయన ఆరా తీశారు. అనంతరం నీటి పంపింగ్, గేట్లు, ఇతరత్రా వాటిపై ఆరా తీశారు. ఆయన వెంట ఈఈ సుభకుమార్, డీఈఈలు ఉన్నారు.

275 ఎకరాల్లో మల్బరీ తోటల అభివృద్ధి

కర్నూలు(అగ్రికల్చర్): 2024-25 సంవత్సరానికి పట్టు పరిశ్రమ శాఖ ద్వారా 175 ఎకరాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 ఎకరాల్లో మల్బరీ తోటలు అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యం నిర్ణయించిందని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఐ.విజయకుమార్ మంగళవారం తెలిపారు. మల్బరీ మొక్కలు నాటుకోవడానికి ఎకరాకు యూనిట్ రూ.30 వేలు ఉండగా... ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం (రూ.27,000), ఇతరులకు 75 శాతం (రూ.22, 500) సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆశలన్నీ కేంద్ర బృందంపైనే!

నేడు కర్నూలు జిల్లా, రేపు నంద్యాల జిల్లాలో సెంట్రల్ టీం పర్యటన

- రబీ కరువుతో నష్టపోయిన రైతులు 92,208 మంది
- ఇన్‌పుట్ సబ్సిడీ రూ.రూ.96,05,57,085 అవసరం



కల్లూరు మండలంలో అనావృష్టి వల్ల పూర్తిగా దెబ్బతిన్న శనగ పంట

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24లో వర్షాభావం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. 2019-20 నుంచి వర్షాలు విస్తారంగా కురిసినా.. 2023-24లో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా గత ప్రభుత్వం మార్చి నెల 15న కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 12 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఎన్యూమరేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఆయా జిల్లాల యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపాయి. రబీ కరువు పరిస్థితిని తెలుసుకునేందుకు బుధవారం, గురువారాల్లో ఉమ్మడి జిల్లాలో సెంట్రల్ టీం పర్యటించనుంది. కేంద్ర బృందం ప్రధానంగా జొన్న, శనగ రైతులతో ముఖాముఖి మాట్లాడటం, కరువు తీవ్రతను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తుంది.

నేడు కర్నూలు జిల్లా, రేపు నంద్యాల జిల్లాలో సెంట్రల్ టీమ్ పర్యటన

☛ ఎన్‌డీఆర్‌ఎఫ్ నార్మ్స్ ప్రకారం కేంద్రం కరువు ప్రాంతాలకు నిధులు విడుదల చేసే ముందు ప్రత్యేక బృందాన్ని పంపుతుంది.

☛ ఇందులో భాగంగా ముగ్గురు ఉన్నతాధికారుల బృందం ఈ నెల 19, 20 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనుంది.

☛ 19న(బుధవారం) 4.30 గంటలకు సెంట్రల్ టీమ్ ఆలూరు చేరుకుంటుంది. ఆలూరు, కోడుమూరుల్లో కరువుపై జొన్న, శనగ రైతులు, సంబంధిత శాఖల అధికారులతో చర్చించడంతో పాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తుంది.

☛ ఆ తర్వాత కర్నూలు చేరుకొని కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో ఫొటో ఎగ్జిబిషన్ తిలకించడంతో పాటు శనగ, జొన్న రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు.

☛ బుధవారం రాత్రి కర్నూలులో బస చేయనున్న కేంద్ర బృందం గురువారం(20వ తేదీ) కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల మండలాల్లో పర్యటించి రైతులతో రబీ కరువుపై ముఖాముఖిగా మాట్లాడుతారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు.

కరువుతో నష్టపోయిన రైతులు 92,208 మంది

2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. కరువుతో మొత్తం 92,208 మంది రైతులు నష్టాలను మూటకట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 20 రకాల పంటలు, నంద్యాల జిల్లాలో 16 రకాల పంటలు దెబ్బతినడం గమనార్హం. కర్నూలు జిల్లాలో 33 శాతం ఆపైన అనావృష్టి వల్ల 57,677.62 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా ఇన్‌పుట్ సబ్సిడీ రూ.58.28 కోట్లు.. నంద్యాల జిల్లాలో 38,801.78 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా ఇన్‌పుట్ సబ్సిడీ రూ.37.76 కోట్లు అవసరం అవుతోంది.



దుద్యాలలో ఎండిపోయిన పొగాకు పంట

కరువు పరిస్థితిని వివరిస్తాం



కేంద్ర బృందం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. సెంట్రల్ టీమ్‌లో ముగ్గురు ఉన్నతాధికారులు ఉండగా.. ఇందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మూడు లైజనింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం రబీ పంటలు లేనందున సంబంధిత రైతులతో ముఖాముఖి మాట్లాడి కరువు తీవ్రతను తెలుసుకుంటారు. రబీ కరువు ప్రతిబింబించేలా ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నాం.

–పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

రబీ కోలుకోలేని విధంగా దెబ్బతీసింది



2023-24 రబీ సీజన్ రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. రబీలో మేము 12 ఎకరాల్లో శనగ సాగు చేశాం. ఎకరాకు సగటున రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టా. అనావృష్టి పరిస్థితుల కారణంగా పంట పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు కనీసం క్వింటం కూడా దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. కరువు తీవ్రతను పరిశీలించేందుకు జిల్లాకు కేంద్ర బృందం వస్తోంది. వారు రబీలో ఏర్పడిన కరువు పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకుని కరువు రైతుకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

– హనుమంతు రెడ్డి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

కేంద్ర బృందానికి పంట నష్టాన్ని వివరించండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: గత సంవత్సరం రబీ సీజన్‌లో పంట నష్టపోయిన వివరాలను ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీంకు స్పష్టంగా నివేదించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కేంద్ర కరువు బృంద పర్యటనపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బృందం టీమ్ లీడర్, న్యూఢిల్లీ డిపార్టుమెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ గాట్కేర్ (ఐఏఎస్), తాగు నీరు, పారిశుద్ధ్య శాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్) ఆషిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోని సభ్యుల బృందం ఈ నెల 20వ తేదీన జిల్లాకు రానున్నారు. కేంద్ర కరువు బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, కరవు తీవ్రతను ఆ బృంద పరిశీలకులకు సమగ్రంగా వివరించేలా సిద్ధంగా ఉండాలన్నారు. కరువుకు సంబంధించి 13 మండలాల్లో 36,389 హెక్టార్లలో పప్పు శనగ, 4,116 హెక్టార్లలో మినుములు, 2,076 హెక్టార్లలో పొగాకు, 12,908 హెక్టార్లలో జొన్న పంటలకు జరిగిన నష్టాన్ని స్పష్టంగా, అర్థమయ్యే రీతిలో ఇంటర్ మినిస్టీరియల్ టీంకు వివరించాలన్నారు. తమ్మరాజుపల్లెలోని వాటర్ స్కీమ్, కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు గ్రామం, ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామాల్లో కేంద్ర కరువు బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించనున్న నేపథ్యంలో వివిధ పంటలను సాగు చేసి నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించాలన్నారు. ఇందుకు నష్టపోయిన పంటల ఫొటోలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, భూగర్భ జల శాఖ డీడీ రఘురాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వాతి ఉత్సవం .. నారసింహుడి వైభవం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని మంగళవారం దిగువ అహోబిలంలో స్వాతి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. నల్లమలలో కొలువైన నవనారసింహ క్షేత్రాల్లో కొలువైన అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను అద్దాల మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి, నవకళశాలతో తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం విద్వాంసుల మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వాతి, సుదర్శన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాలను ముగించారు. రాత్రి ఉత్సవ మూర్తులకు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఉత్సవ మూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లన్న అన్నదాన పథకానికి రూ. 2లక్షల విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం దాతలు రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. నెల్లూరుకు చెందిన సీహెచ్ పోలయ్య రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షణకులు మధుసూదన్ రెడ్డికి అందజేశారు. అలాగే గుంటూరుకు చెందిన సద్భృశ్య రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలను దేవస్థానం తరుపున జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



గుంటూరుకు చెందిన దాత సద్భృశ్యను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

'పీఎం కిసాన్' నిధుల్లో భారీగా కోత

- కర్నూలు జిల్లాలో 62,120 మంది రైతులకు మొండిచేయి

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ నిధుల విడుదలలో కర్నూలు జిల్లాకు భారీగా కోత పడింది. 16వ విడతతో పోలిస్తే 17వ విడతలో 62,120 మంది రైతులకు మొండిచేయి చూపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం 17వ విడత పీఎం కిసాన్ నిధులను బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు విడుదల చేశారు. 2,34,853 మందికి రూ.2000 ప్రకారం రూ.46,97,06,000 రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యాయి. 16వ విడతలో 2,96,973మంది రైతులకు రూ.59.39 కోట్లు ప్రయోజనం లభించింది. అంటే ఈ విడతలో ఏకంగా 62 వేలకుపైగా రైతులకు రూ.12. 42 కోట్లు కోత పడింది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి కొలువుదీరిన వెంటనే పీఎం కిసాన్ నిధులు విడుదల చేసి తీపి కబురు అందించినప్పటికీ భారీగా కోత విధించడం పట్ల రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నంద్యాల జిల్లాకు సంబంధించి 1.95 లక్షల మంది రైతులకు రూ. 39.19 కోట్లు విడుదలయ్యాయి.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కర్నూలు(అర్బన్): ఈ నెల 19న (నేడు) నిర్వహించనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలు కారణాల వల్ల ఈ సమావేశాన్ని వాయిదా వేశామన్నారు. తిరిగి ఈ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): ఏడాది, రెండేళ్ల పారిశ్రామిక శిక్షణా కోర్సుల్లో(ఐటీఐలో) ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. జిల్లాలోని డోన్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,021 సీట్లు ఉండగా 3,256 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ల కోర్సులకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, ఇన్స్టూమెంట్ మెకానికల్, డీజిల్ మెకానికల్, సివిల్ అండ్ డ్రాఫ్ట్‌మెన్, ఏడాది కోర్సులు వెల్డర్, మెకానిక్ డీజల్, కట్టింగ్ అండ్ సూయింగ్, కోపా ఉన్నాయి. విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబరుకు కౌన్సెలింగ్ సంబంధించిన సమాచారం చేరవేశారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. పదవ తరగతి మార్కులు, రిజిస్ట్రేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

కౌన్సెలింగ్ వివరాలు..

తేదీ	ర్యాంక్
20	1 నుంచి 281 వరకు
21	282 నుంచి 640 వరకు
22	641 నుంచి 1,021 వరకు

షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలి



విద్యార్థులు పదవ తరగతి మార్కు లను బట్టి ర్యాంకు ఇచ్చాం. విద్యార్థులకు పూర్తి సమాచారం మెసేజ్ ఫోన్లకు పంపించాం. షెడ్యూల్ మేరకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. పదవ తరగతి మార్కులు, రిజిస్ట్రేషన్ రోస్టర్ ఆధారంగా పూర్తి పారదర్శకంగా ప్రవేశాల ప్రక్రియ ఉంటుంది. ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తాం.

– ప్రసాదరెడ్డి, జిల్లా ఐటీఐ ప్రవేశాల కన్వీనర్, నంద్యాల

డీసీసీబీలో మాన్సూన్ డిపాజిట్ స్కీమ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు 444 రోజులకు మాన్సూన్ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించిందని, ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్ తెలిపారు. ఈ డిపాజిట్ స్కీమ్ ఈ నెల 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేటు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్‌లకు 8.50 శాతం (ఎఫెక్టివ్ రేటు 8.88 శాతం), 60 ఏళ్లలోపు వారికి 8 శాతం (ఎఫెక్టివ్ రేటు 8.30 శాతం) ఉంటుందని పేర్కొన్నారు. డిపాజిట్‌లకు పూర్తి భద్రతతో పాటు డిపాజిట్ ఇన్సూరెన్స్ గ్యారంటీ సదుపాయం రూ.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నూతన డిపాజిట్ స్కీమ్‌ను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని బ్రాంచ్ మేనేజర్లను ఆయన ఆదేశించారు.



ఉయ్యాలవాడలో జోరుగా కురుస్తున్న వర్షం



రుద్రవరం మండలం బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ఆశాజనకంగా వానలు

- ఉయ్యాలవాడలో 109.6 మి.మీ వర్షపాతం

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల పరిధిలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఉయ్యాలవాడలో 109.6 మి.మీ, అత్యల్పంగా వెలుగోడులో 0.2 మి.మీ మేర వర్షం కురిసింది. ఆళ్లగడ్డ 102.2 మి.మీ, రుద్రవరం 100.4, మహానంది 47.4, దొర్నిపాడు 44.2, చాగలమర్రి 43.4, సంజామల 21, కోవెలకుంట్ల 18.4, బండిఆత్మకూరు 13.6, శిరివెళ్ల 11.2, బనగానపల్లె 10.2, గోస్పాడు 4.2, నంద్యాల 1.4, కొలిమిగుండ్ల 1.4 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మాయలూరు - ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలోని కుందరవాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల్లో లోతట్టు పంట పొలాల్లో వర్షపునీరు నిలిచింది.

రానున్న ఐదురోజుల్లో చిరుజల్లులు

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో రాబోయే ఐదు రోజుల్లో చిరుజల్లులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.6-37.4 డిగ్రీల మధ్య, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.4-27.5 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని తెలిపారు.

క్లుప్తంగా

బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న విశ్వేశ్వరరావు

పాములపాడు: కడుపునొప్పి తాళలేక మండలంలోని బాను ముక్కల గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు(25) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు.. విశ్వేశ్వరరావు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. పలు చోట్ల వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బాత్‌రూంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉరి నుంచి తప్పించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి భార్య రేణుకమ్మ ఉంది. మృతుని తండ్రి చిన్న హనుమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని యువకుడు

కర్నూలు: పంచలింగాల-తాండ్రపాడు అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 240/7-8 కిలోమీటర్ వద్ద రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడివున్నట్లు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కేవై సంజన్నకు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఆయన రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండ రాముడుకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంలో ముఖం నుజ్జునుజ్జు కాగా కాళ్లు పూర్తిగా తెగిపోయాయి. సుమారు 25 ఏళ్ల వయస్సు ఉండి బూడిద రంగు రౌండ్ నెక్ టీషర్టు, బ్రౌన్ కలర్ ఫుల్ డ్రాయర్ ధరించాడు. దానిపై డిక్సీ జోష్ ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయి. లైట్‌గా గడ్డం ఉంది. 5.2 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంటాడు. కుడివైపు పొట్టకు, ఛాతీకి నల్లటి మచ్చలు ఉన్నాయి. ఆచూకీ తెలిసినవారు 9441970940 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండ రాముడు కోరారు.

ప్రకృతి పరవళ్లు!


వర్షపు నీటితో కళకళలాడుతున్న గార్గేయపురం చెరువు

గార్గేయపురం చెరువులో కేరింతలు కొడుతున్న వానరాలు


సెలయేరును తలపిస్తున్న చెరువు నీరు


చెరువు కట్ట చెట్లపై విదేశీ పక్షులు



నగరవనం ముఖద్వారం, ఆకట్టుకుంటున్న రకరకాల పక్షులు

ఆహ్లాదకరమైన పార్క్.. ఆ పక్కనే నిండుకుండను తలపిస్తున్న చెరువు.. అందులో జలకాలాటలలో అంటూ ఈత కొడుతున్న వానరాలు.. మరోపక్క పక్షుల కిలకిలారావాలు.. వెరసి ప్రకృతి ప్రేమికులను పరవశానికి గురిచేస్తున్నాయి. కర్నూలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న నగర వనం సమీపాన గార్గేయపురం చెరువు వద్ద ఈ సుందర దృశ్యాలు నందికొట్కూరు వైపు వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ప్రారంభ దశలో నోటి క్యాన్సర్‌ను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎన్‌సీడీ జిల్లా నోడల్ అధికారిణి హేమలత

కర్నూలు(హాస్పిటల్): ప్రారంభ దశలో నోటి క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని జిల్లా ఎన్‌సీడీ నోడల్ అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిలో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నోటి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించకపోతే శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి ప్రాణాంతకం అవుతుందన్నారు. శిక్షకురాలు డాక్టర్ మంజూషా మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ హ్యూమన్ పాపిల్లోమా (హెచ్‌పీవీ) వైరస్ కారణంగా వస్తుందన్నారు.

వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుందని చెప్పారు. 9 నుంచి 14 ఏళ్ల వయస్సులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తే ఈ క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. 30 ఏళ్లు దాటిన మహిళలు లక్షణాలు లేకపోయినా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వివాహమైన మహిళలు ఏటా పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకోవాలని, క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించగలిగితే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల 70 నుంచి 80 శాతం వరకు గర్భాశయ ముఖద్వారం ద్వారా క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చన్నారు. డాక్టర్లు సాహిత్య జయరామ్, రజిత, తులసిబాయి, నాగరాజు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు విధుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు

- అడిషనల్ ఎస్పీ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ, హాజరైన సెబ్ అధికారులు

కర్నూలు: చెక్‌పోస్టు విధుల్లో ఉంటూ మద్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ నాగరాజు హెచ్చరించారు. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ వినోద్ కుమార్‌లతో కలిసి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎక్సైజ్ నేరాలపై అడిషనల్ ఎస్పీ సమీక్షించారు. ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం కేసుల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లోనూ చార్జిట్లు వేయాలని, గంజాయి అమ్మకందారులు, రవాణాదారులపై నిఘా ఉంచి కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సారా తయారీ స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహిస్తూ పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పదేపదే నేరాలకు పాల్పడుతున్నవారిని తహసీల్దార్ల ఎదుట హాజరుపరచి బైండోవర్లు చేయాలన్నారు. నేరాలకు పాల్పడబోమని తహసీల్దార్ ఎదుట రూ.లక్ష బాండ్‌తో పూచీకత్తు ఇచ్చి, తిరిగి నేరాలకు పాల్పడిన మజ్జిగ బసవరాజు, మదిర శివలను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆదేశించారు. వారితో జరిమానా కూడా వసూలు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మద్యం, సారా కేసులకు సంబంధించి చార్జిషీట్లు పూర్తి చేసి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో సెబ్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు రాజేంద్రప్రసాద్, రామాంజనేయులు, విన్నీ లత, భార్గవ రెడ్డి, మహమ్మద్ బాషా, సోమశేఖర్, స్వర్ణలత, చెక్‌పోస్టు సీఐలు తిరుమలయ్య, విశ్వేశ్వర రావు, చెన్నారెడ్డి, శ్రీధర్, డోర్కాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సులపై నిఘా

- జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్


కర్నూలులో బడి బస్సుల రికార్డులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కర్నూలు: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను తీసుకెళ్లే ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ అధికారులు నిఘా పెట్టారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు(ఎంవీఐ) మనోహర్ రెడ్డి, బాబు కిషోర్, మల్లికార్జున్ తదితరులు వారి సిబ్బందితో బృందాలుగా ఏర్పడి కర్నూలులోని సి.క్యాంప్, నంద్యాల చెక్‌పోస్టు, బళ్లారి చౌరస్తా, సుంకేసుల రోడ్డులో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలో రవాణా శాఖ అధికారులు బడి బస్సులపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించారు. మరమ్మతుల్లో ఉన్న వాటిని రోడ్లపైకి తీసుకొస్తే వాటిని కార్యాలయానికి తరలించే పనిలో ఉన్నారు. జిల్లాలో మొత్తం 416 బడి బస్సులు ఉండగా, ఇప్పటివరకు 350 బస్సులకు వాటి యాజమాన్యాలు ఎఫ్‌సీ చేయించుకున్నారు. మరో 66 బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవాల్సి ఉంది. వాటి యజమానులకు అధికారులు ఇప్పటికే నోటీసులు అందజేశారు. మంగళవారం రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన కొన్ని బస్సులను తనిఖీ చేయగా చిన్నచిన్న మరమ్మతులు చేయించాల్సిన మూడు బస్సులను వెనక్కు పంపారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా 120 బస్సులకు పైగా తనిఖీలు చేపట్టి కొన్నింటికీ అవసరమైన సూచనలు చేశారు.

ఆటో బోల్తా..బాలిక దుర్మరణం

- మరొకరికి గాయాలు


మృతిచెందిన ఆల్ఫీషా

ఆల్ఫీషా(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని ఎద్దుల మార్కెట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక దుర్మరణం చెందింది. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఆవులను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. గోనెగండ్లకు చెందిన రహంతుల్లా, నీసీమా దంపతులకు ముగ్గురు సంతానం. రహంతుల్లా కర్నూలులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బక్రీద్ పండుగ కావటంతో కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం గోనెగండ్లకు వచ్చారు. పండుగను సంతోషంగా నిర్వహించుకున్నారు. తన సోదరి భానును చూసేందుకని ఉదయం భార్య, పిల్లలతో కలిసి ఎమ్మిగనూరుకు వచ్చారు. భానుతో రహంతుల్లా పిల్లలు కాసేపు సంతోషంగా గడిపారు. ఈక్రమంలో రహంతుల్లా పెద్ద కూతురు ఆల్ఫీషా(12)ను తీసుకుని భాను మోర్ సూపర్ మార్కెట్‌కు వెళ్లింది. అక్కడ పని ముగించుకుని ఆటోలో తిరిగి వస్తుండగా ఎద్దుల మార్కెట్ వద్ద రోడ్డుకు ఆవులు అడ్డంగా వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆల్ఫీషా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

శిలాఫలకాలు ధ్వంసం


టి.గోకులపాడు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సంబంధించిన శిలాఫలకం ధ్వంసం చేసిన దృశ్యం


చెరుకులపాడు వద్ద ధ్వంసమైన పాల హంద్రీ వంతెన శిలాఫలకం

కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామ సమీపంలో కృష్ణగిరి ప్రధాన రహదారిలో పాల హంద్రీపై రూ.23 కోట్లతో హైలెవెల్ వంతెనను నిర్మించేందుకు ఈ ఏడాది మార్చి 11న అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అలాగే కృష్ణగిరి మండలం టి. గోకులపాడు గ్రామంలో కూడా దాదాపుగా రూ.30 లక్షలతో జలజీవన్ పథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, పైపు లైన్ పనులను పూర్తి చేసి ప్రారంభించిన శిలాఫలకాన్ని, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని 2019లో ప్రారంభించిన శిలాఫలకాన్ని సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. అదేవిధంగా చుంచుఎర్రగుడి గ్రామంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి తమ్ముడు శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తలు హంగామా చేశారు. ఈ విషయంపై ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా టి.గోకులపాడులో శిలాఫలాకాలను ధ్వంసం చేశారని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారని, అయితే సంబంధిత అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామన్నారు.

యువకుడి దారుణహత్య



ఖాదర్‌వలి (ఫైల్)

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని కురుకుంద గ్రామానికి చెందిన ఖాదర్‌వలి (20) సోమవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కురుకుంద గ్రామానికి చెందిన ఫారూక్, ఆత్మకూరు అర్బన్ కాలనీకి చెందిన ఖాదర్‌వలి కోవా-బన్ను వ్యాపారం చేస్తున్నారు. ఆత్మకూరు నుంచి హైదరాబాద్ వరకున్న వివిధ పట్టణాల్లో వ్యాపారం సాగిస్తున్నారు. బక్రీద్ పండుగ కావడంతో ఆదివారం రాత్రి ఒకే వాహనంలో వారు ఆత్మకూరు వచ్చారు. మార్గమధ్యంలో వారి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఉదయం ఎవరి ఇళ్లకు వారు వెళ్లి పండుగ చేసుకున్నారు. సోమవారం రాత్రి ఖాదర్‌వలి అతని మిత్రబృందం పట్టణ శివారులో మద్యం తాగుతూ ఫారూక్‌కు ఫోన్ చేశారు. అతడు కురుకుందలోనే ఉన్నట్లు తెలుసుకుని వారంతా అక్కడికి వెళ్లారు. గ్రామం చివరలో ఉన్న కల్లాల వద్ద ఖాదర్‌వలి మిత్రబృందానికి ఫారూక్ ఎదురుపడటంతో అక్కడ వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో ఖాదర్‌వలిని ఫారూక్ కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావానికి గురైన ఖాదర్‌వలిని అతని మిత్రబృందం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి మాలిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అమృత్ సరోవర్‌లలో ప్రపంచ యోగా దినోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని అమృత్ సరోవర్ చెరువు ప్రదేశాల్లో నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం తమ కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 75 చెరువులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేశామన్నారు. వీటన్నిటిలో 21వ తేదీ ఉదయం 9 గంటల్లోపు యోగా చేయాలని సూచించారు. చెరువు పరిసరాల వద్ద ప్రశాంత వాతావరణం ఉంటుందని, యోగా ఔత్సాహికులు చేరడానికి, వివిధ యోగాసనాలు అభ్యసించడానికి, యోగా సంపూర్ణ అభ్యాసంలో మునిగిపోవడానికి అనువైన ప్రదేశాలన్నారు. యోగా దినోత్సవం నిర్వహణపై గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధి సిబ్బంది, గ్రామ పంచాయతీ స్థాయి అధికారి, గ్రామ పెద్దలు కలసి సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. యోగా దినోత్సవం ఫొటోలను వెంటనే అమృత్ సరోవర్ పీఎల్‌ఓ లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

- ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు


మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు కేవలం ఆంగ్ల మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదవలేక, తెలుగు మీడియం లేక చదువు మానుకునే పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తెలుగు మీడియాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనాన్ని రద్దు చేసి, ప్రాథమిక విద్యను కాపాడాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు మాత్రమే అమలు చేయాలని, పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని, 28 వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, నిరుద్యోగ ఉపాధ్యాయులకు వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తొలగించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులను, బదిలీలను చేపట్టాలన్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రతాపరెడ్డి, బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు నాగన్న, మహబూబ్ బాషా, బాల వెంకటేశ్వర్లు, రాంపుల్లారెడ్డి, చంద్రశేఖర ఆచారి, నాగయ్య, మల్లికార్జునయ్య, శ్రీరాములు, జిల్లా మహిళాప్రతినిధి కవిత తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేస్తే తోలు తీస్తా’

సాక్షి, నంద్యాల: వలంటీర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల పోస్టులకు కొంత మంది నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రం నంద్యాలలో ఆయన మాట్లాడుతూ రూ.లక్ష ఇస్తే వలంటీర్ పోస్టు ఇస్తామని కొంత మంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారి తోలు తీసి ఉప్పు కారం వేసి కుట్లు వేస్తానని బైరెడ్డి హెచ్చరించారు. నందికొట్కూరులో టీడీపీకి చెడ్డ పేరు తెచ్చేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగానే ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. ఉద్యోగాల పేరుతో అమాయక ప్రజల నుంచి డబ్బులు గుంజాలని చూస్తే చూస్తూ ఊరుకొనని చెప్పారు. కాగా నందికొట్కూరు టీడీపీలోని నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం మాండ్ర శివానందరెడ్డి వైపు ఉండగా మరో వర్గం ఎంపీ బైరెడ్డి శబరికి మద్దతుగా నిలుస్తోంది. మాండ్ర వర్గమైన ఎమ్మెల్యే గిత్త జయసూర్యను దృష్టిలో పెట్టుకొని బైరెడ్డి హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. అయితే అసలు టీడీపీ సభ్యత్వమే తీసుకోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తమను హెచ్చరిస్తూ మాట్లాడటంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.